క్లుప్తంగా

జగనన్న సురక్ష షెడ్యూల్ విడుదల

ఒంగోలు రూరల్: మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమం షెడ్యూల్‌ను ఒంగోలు ఎంపీడీవో పి.అజిత శుక్రవారం విడుదల చేశారు. తాత్కాలిక మండల మెడికల్ ఆఫీసర్‌తో వైద్య బృందం ఒక గ్రూపుగా, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.వాణితో రెండో గ్రూపుగా ఏర్పడి జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మొదటి టీం 30వ తేదీ చేజర్ల సచివాలయంలో, అక్టోబర్ 4న దేవరంపాడు హరిజన పాఠశాలలో, 6న కరవది అంబేడ్కర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో, 9న సర్వేరెడ్డిపాలెం ఎంపీ స్కూల్లో, 11న వలేటివారిపాలెం విలేజ్ హెల్త్ క్లినిక్‌లో, 21న చింతాయగారిపాలెంలో జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించనున్నట్లు వివరించారు. రెండో బృందం అక్టోబర్ 3వ తేదీ దశరాజుపల్లె సచివాలయంలో, 5న గుండాయపాలెం యూపీ స్కూల్లో, 7న మండువవారిపాలెం విలేజ్ హెల్త్ క్లినిక్‌లో, 10న ఉలిచి జెడ్పీ హైస్కూల్లో, 12న యరజర్ల యూపీ స్కూల్లో జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఆయా తేదీల్లో ఆయా గ్రామాల ప్రజలు శిబిరాల్లో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని, ఆ మేరకు సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సూచించారు.

అనాథ పిల్లలకు అన్నదానం



బొమ్మరిల్లులో అన్నదానం చేస్తున్న దాతలు

ఒంగోలు సెంట్రల్: స్థానిక హౌసింగ్‌బోర్డులోని బొమ్మరిల్లు అనాథాశ్రమంలో శుక్రవారం యూపీ రాష్ట్రం బస్తీ జిల్లా కలెక్టర్ వంశీకృష్ణ పుట్టినరోజు సందర్భంగా బంధుమిత్రులు పాల్గొని పిల్లలకు అల్పాహారం, అన్నదానం చేశారు. ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం కౌన్సిల్ మెంబర్ సుమతి, జైభీమ్ ఫౌండేషన్ చైర్మన్ నాగేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ అసిస్టెంట్ కో ఆర్డినేటర్ మండే హర్షప్రీతమ్ దేవకుమార్, బొమ్మరిల్లు నిర్వాహకులు రాజ్యలక్ష్మి, ఎస్ఎంబీ ఖాశింలు దాతల దాతృత్వాన్ని కొనియాడారు. నత్తల శ్రీనివాసులు, కృష్ణారావు, అనిల్‌కుమార్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాజ్యలక్ష్మి అమ్మవారి ప్రాకారోత్సవం



అమ్మవారి పల్లకీ సేవలో ఆలయ నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: స్థానిక కేశవస్వామిపేటలోని ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో రాజ్యలక్ష్మి అమ్మవారికి శుక్రవారం ప్రాకారోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి ఆశీర్వచనం అందుకున్నారు. చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, కార్యనిర్వహణ అధికారి డి.రజనీకుమారి, ధర్మకర్తల మండలి సభ్యులు, వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.



లక్ష్మీపురంలో పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



ఒంగోలు దేవుడుచెరువు పార్క్ సమీపంలో గాజుల అలంకరణలో వినాయకుడి విగ్రహం



భీమరాజువారివీధిలో నెమలిపించాల అలంకరణలో గణనాథుడు

కోలాహలంగా వినాయక నిమజ్జనాలు

లక్ష్మీపురంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: వినాయకచవితి సందర్భంగా పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలను శుక్రవారం కోలాహలంగా నిమజ్జనం చేశారు. చీమకుర్తి మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో స్థానిక భక్తులు నిర్వహించిన వినాయక నిమజ్జనోత్సవంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొన్నారు. స్వామివారికి పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

మారం వెంకారెడ్డి పూజలు...

చీమకుర్తిలోని రెడ్డిబజారులో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహానికి వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ పరిశీలకుడు మారం వెంకారెడ్డి శుక్రవారం పూజలు నిర్వహించారు. అర్చకుల ద్వారా ఆశీసులు, తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పోకూరి రామకృష్ణారెడ్డి, బడే దశరథరామిరెడ్డి, మారం వెంకటేశ్వరరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కొత్తపట్నం తీరంలో 47 విగ్రహాల నిమజ్జనం...

కొత్తపట్నం: వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన విగ్రహాల నిమజ్జనాలు ఊపందుకున్నాయి. అందులో భాగంగా శుక్రవారం ఐదోరోజు 47 గణేష్ విగ్రహాలను కొత్తపట్నం సముద్రతీరంలో నిమజ్జనం చేశారు. ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలీస్ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. మెరైన్ సీఐ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.



చీమకుర్తిలో పూజలు చేస్తున్న మారం వెంకారెడ్డి



కొత్తపట్నం బీచ్‌లో గణేష్ విగ్రహాల నిమజ్జనం



కేవీ పాలెంలో నిమజ్జనానికి తరలుతున్న బొజ్జ గణపయ్య

జగనన్న ఆరోగ్య సురక్ష గొప్ప కార్యక్రమం

ఒంగోలు సబర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు ఉపయోగపడే గొప్ప కార్యక్రమం అని ఒంగోలు నగర కమిషనర ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక పాపాకాలనీ యూపీహెచ్‌సీ పరిధిలోని సచివాలయాలలో ఆయన పర్యటించారు. గోపాల్‌నగర్-1, 2 సచివాలయాల పరిధిలో 24.21, 12.35 శాతం మేర ఇంటింటి సర్వే పూర్తి చేశారన్నారు. అదేవిధంగా ఇస్లాంపేట సచివాలయం పరిధిలో 13.36 శాతం సర్వే పూర్తయిందన్నారు. ఆయా సచివాలయాల పరిధిలో అక్టోబర్ 5వ తేదీ నాటికి 100 శాతం ఇంటింటి సర్వే పూర్తి చేయాలని సిబ్బదిని ఆదేశించారు. అవసరమైన ప్రతి ఒక్కరికీ కేస్ షీట్ తయారు చేసి అక్టోబర్ 9న జరిగే క్యాంపుకు తీసుకురావాలని సూచించారు. నగరంలోని 9 యూపీహెచ్‌సీల పరిధిలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు విస్తృతంగా పర్యటించడమే కాకుండా ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం వైద్య పరీక్షలు ఇంటి వద్దే చేసి నివేదికలు రూపొందించాలని ఆదేశించారు.

స్వచ్ఛతా హీ సేవపై అవగాహన పెంచుకోవాలి...

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా రూపొందించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని కమిషనర్ సూచించారు.



ఆర్టీసీ బస్టాండ్ వద్ద స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్

ఆ మేరకు ఒంగోలు నగరంలో పారిశుధ్య కార్మికులు, అధికారులతో శుక్రవారం ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. స్థానిక ట్రంక్ రోడ్డు, కర్నూలు రోడ్డు, ముంగమూరు రోడ్డు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ డిపో వద్ద ప్రయాణికులకు పాంప్లేట్లు పంచిపెట్టి అవగాహన కల్పించారు.

పన్నుల వసూళ్లలో అలసత్వం తగదు...

పన్నుల వసూళ్లలో అలసత్వం తగదని సచివాలయ సిబ్బందిని కమిషనర్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన చాంబర్‌లో వార్డు సచివాలయ అడ్మిన్‌లు, ఎమినిటీ సెక్రటరీలు, శానిటేషన్ సెక్రటరీలు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. పలు సలహాలు, సూచనలు చేశారు.

అన్న బెదిరింపులపై చెల్లి ఫిర్యాదు

ఒంగోలు టౌన్: తనను చంపుతానని తన అన్న బెదిరిస్తున్నాడని, రక్షణ కల్పించాలని ఒక మహిళ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. నగరంలోని సంతపేటకు చెందిన శృంగారపు బాలఈశ్వరి, లక్ష్మీనరసింహ శంకరబాబు అన్నా చెల్లెళ్లు. వారికి అమ్మ తరఫున కొత్త మార్కెట్ వద్ద గల వడ్డెపాలెంలో 2279 చ.అడుగుల స్థలం, అందులో రేకుల ఇళ్లు ఉంది. అందులో 1161 చ.అడుగుల స్థలాన్ని బాలఈశ్వరికి ఇచ్చారు. ఆ స్థలానికి సంబంధించి 2000 సంవత్సరంలో డీకే పట్టా కూడా తీసుకున్నారు. ఇటీవల తన వాటాగా వచ్చిన స్థలంలో రేకుల ఇంటిని ఆమె పడగొట్టించి ప్రహరీ నిర్మించాలనుకోగా, శంకరబాబు అభ్యంతరం వ్యక్తం చేయగా, పెద్ద మనుషుల సమక్షంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం బాలఈశ్వరి ప్రహరీ నిర్మాణం మొదలుపెట్టింది. శుక్రవారం సాయంత్రం భార్య సుభాషిణితో కలిసి గోడను శంకరబాబు కూల్చివేశాడు. ఆ గోడ కాళ్ల మీద పడటంతో బాలఈశ్వరికి గాయమైంది. అంతే గాకుండా గోడ నిర్మిస్తే నిన్ను, నీ భర్తను చంపుతానంటూ బెదిరించడంతో రక్షణ కల్పించాలంటై వన్‌టౌన్ పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అశోక్‌బాబును అభినందించిన సీఎం జగన్

ఒంగోలు: ఆరోగ్యశ్రీ రాష్ట్ర స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదాల అశోక్‌బాబును సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. ఆరోగ్యశ్రీ పథకం లబ్ధిదారులను కలుసుకుని వారి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని అశోక్‌బాబుకు గతంలో సీఎం సూచించారు. ఆ మేరకు ఆరోగ్యశ్రీ ద్వారా లబ్ధిపొంది ఇంటివద్ద కోలుకుంటున్న వారిని క్షేత్రస్థాయిలో కలుసుకుని తీసుకున్న ఫీడ్‌బ్యాక్ వివరాలతో కూడిన ఆల్బమ్‌ను శుక్రవారం అసెంబ్లీ వద్ద సీఎంకు అశోక్‌బాబు చూపించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబును సీఎం అభినందించారు. అర్హులందరినీ ఆరోగ్యశ్రీ పథకం ఆదుకునే విధంగా ప్రజల్లో చైతన్యం కలిగించాలని సూచించారు.



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరాలు వెల్లడిస్తున్న ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ అశోక్‌బాబు

ఆర్‌బీకేలలో పుష్కలంగా ఎరువులు

మద్దిపాడు: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు ఎరువులు సిద్ధంగా ఉంచినట్లు ఏఓ కె.రమేష్‌బాబు తెలిపారు. యూరియా, డీఏపీ, 20-20-0-13 ఎరువులు, ఇఫ్కో, పీపీఎల్, నాగార్జున కంపెనీలకు చెందిన అన్ని రకాల ఎరువులు 255 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. మండలంలోని రైతులు నకిలీ ఎరువులు వాడకుండా కంపెనీ ఎరువులను దగ్గరలో ఉన్న ఆర్‌బీకేలలో తీసుకోవాలని సూచించారు. పొగాకు పంటకు సంబంధించి అమ్మోనియం సల్ఫేట్ సూపర్‌ఫాస్ఫేట్, ఎరువుల కోసం రైతులు ముందుగా కొంత నగదు చెల్లించి ఎరువులు తీసుకున్న తర్వాత మిగిలిన మొత్తాన్ని ఆర్‌బీకేలలోని వీఏఏలకు చెల్లించాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఇప్పుడు సాగుచేస్తున్న మిరప, వరి, మొక్కజొన్న పంటలకు సంబంధించిన ఎరువులు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు, మధ్యవర్తుల మాటలు నమ్మి నకిలీ ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు రైతులు కొనుగోలు చేసి నష్టపోవద్దన్నారు. మధ్యవర్తులు ఎవరైనా తక్కువ ధరకు ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు ఇస్తామంటూ గ్రామాల్లోకి వస్తే వెంటనే మండల వ్యవసాయ శాఖ అధికారికి, ఆర్‌బీకే సిబ్బందికి, తెలియజేయాలని ఆయన తెలిపారు.



నందిపాడులో రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్న మండల వ్యవసాయ అధికారి రమేష్

విద్యార్థులు అవగాహనతో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న డాక్టర్ ఎలియా

ఒంగోలు సెంట్రల్: విద్యార్థులు అవగాహనతో ముందుకు సాగితే విజయం తథ్యమని పేస్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ సూచించారు. స్థానిక పేస్ కళాశాలలో ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ఏంజెల్ పెట్టుబడి, వెంచర్ క్యాపిటల్ ఫండింగ్ అవకాశం అనే అంశంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంబీసీ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.ఎలియా మాట్లాడుతూ ఏపీఏవీసీఎఫ్ అవకాశం ప్రాముఖ్యత, లాభాలను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, ట్రిపుల్ ఐటీ విభాగాధిపతి నాగరాజు, కో కన్వీనర్ డాక్టర్ సీహెచ్ జగదీశ్వరరెడ్డి, కో ఆర్డినేటర్ బి.వెంకటేష్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

వీఎల్ఎస్ఐ డిజైన్‌పై అవగాహన కార్యక్రమం

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో డిపార్టుమెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఆధ్వర్యంలో 'రీసెంట్ ట్రెండ్స్ అండ్ చాలెంజెస్ ఇన్ వీఎల్ఎస్ఐ' అనే అంశంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కళాశాలకు చెందిన డాక్టర్ ఎస్‌కే సాదుల్లా హాజరై మాట్లాడారు. వెరీ లార్జ్ స్కేల్ ఇంటిగ్రేషన్ (వీఎల్ఎస్ఐ) సర్క్యూట్స్ రూపొందించడం వల్ల కలిగే లాభం, మిలియన్లకొద్దీ ట్రాన్సిస్టర్లను ఒకే చిప్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్‌లో అనుసంధానించడం అనే అంశాలపై విద్యార్థులకు సంపూర్ణ అవగాహన కలిగించారు.

జిల్లాస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



నియోజకవర్గం నుంచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు



నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

చీమకుర్తి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సంతనూతలపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో పలు క్రీడలకు సంబంధించిన క్రీడాకారులు ప్రతిభ చూపగా జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పలు ప్రభుత్వ హైస్కూళ్ల నుంచి కబడ్డీ, ఖోఖో పోటీలకు 200 మంది వరకు క్రీడాకారులు పాల్గొన్నారు. వారిలో ప్రతిభ చూపిన వారిని జిల్లాస్థాయి పోటీలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పీడీలు ఎంపిక చేశారు. మూడు రోజులుగా జరుగుతున్న ఈ పోటీల్లో 9 క్రీడాంశాలలో క్రీడాకారులను ఎంపిక చేశారు. చివరి రోజు శుక్రవారం జరిగిన పోటీలకు ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ హాజరై క్రీడాకారులను అభినందించారు. క్రీడలు భవిష్యత్తుకు బంగారు బాటలని ప్రోత్సహించారు. స్కూలు గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి వనజ, నియోజకవర్గ ఇన్‌చార్జి బీ శ్రీనివాసరెడ్డితో పాటు నియోజకవర్గంలోని పలు హైస్కూళ్ల నుంచి పీడీలు రమణయ్య, కృష్ణ, గిరి, వేణు, స్వరూపావాణి, వెంకట్రావు, బాషా సెలక్టర్లుగా వ్యవహరించారు.



నియోజకవర్గ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

26న ఉచిత ఓపీతో వైద్య సేవలు



మాట్లాడుతున్న అరవింద్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్లు

ఒంగోలు అర్బన్: వైరల్, విష జ్వరాలు, హెపటైటీస్‌తో పాటు ప్రస్తుతం వాతావరణంలో చోటుచేసుకుంటున్న ఆకస్మిక మార్పులతో వస్తున్న జ్వరాలు తదితర అంశాలపై ఈ నెల 26వ తేదీ స్థానిక కర్నూలు రోడ్డు పవర్‌ఆఫీస్ ఎదురుగా ఉన్న అరవింద్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు హాస్పిటల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య నిపుణుడు డాక్టర్ మందలపు సరేంద్రబాబు, పల్మనాలజీ వైద్య నిపుణుడు డాక్టర్ భానుతేజ తెలిపారు. శుక్రవారం హాస్పిటల్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అదే రోజు ఉచిత ఓపీల ద్వారా వైద్య సేవలు అందించనున్నట్లు వెల్లడించారు. వైరల్ జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రతిఒక్కరూ పాల్గొని వైరల్, విషజ్వరాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో మాస్కులు, శానిటైజర్లు వినియోగించడం మంచిదన్నారు. జ్వరం, దగ్గు, విరేచనాలు వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని వారు సూచించారు.

పీవీఆర్ విద్యార్థికి అవార్డు



బహుమతి అందుకుంటున్న పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి

ఒంగోలు: స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి వడ్లమాని సాయివికాస్ ఉత్తమ విద్యార్థి అవార్డు అందుకున్నారు. అక్కినేని కళాపరిషత్ ఆధ్వర్యంలో అక్కినేని శతజయంతి ఉత్సవాల్లో భాగంగా పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థికి మెమెంటో, ప్రశంసపత్రం, రూ.2 వేల నగదు అందించారు. 3 నుంచి 10 తరగతుల వరకు ఒక్కో తరగతికి ఒక ఉత్తమ విద్యార్థిని ఎంపికచేసి ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో అక్కినేని కళాపరిషత్ అధ్యక్షుడు కళ్లగుంట కృష్ణయ్య, సీనియర్ ఉపాధ్యాయులు సీహెచ్ లక్ష్మీనారాయణ, పాఠశాల హెచ్‌ఎం మువ్వా రాధిక పాల్గొన్నారు. హెచ్‌ఎం రాధికకు విద్యా పరిపాలనా సంబంధమైన నైపుణ్యత అవార్డు అందించి సత్కరించారు.

బీజేపీ ఆధ్వర్యంలో నేడు రక్తదాన శిబిరం

ఒంగోలు సెంట్రల్: ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన సేవా పక్షోత్సవాల్లో భాగంగా శనివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.శివారెడ్డి తెలిపారు. పార్టీ డాక్టర్స్ సెల్, యువమోర్చా ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో మోదీ అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఒక ప్రకటనలో కోరారు.